# నమస్తే తెలంగాణ

# వికారాబాద్

I | హైదరాబాద్, బుధవారం 16 అక్టోబర్ 2024 | VIKARABAD





పరిగి పోలీస్ సర్కిల్ కార్యాలయం వద్ద బీఆర్ఎస్ నాయకుడు ప్రవీణ్‌కుమార్‌రెడ్డి తదితరులు




నేవీ రాడార్ కేంద్రం శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న కేంద్ర మంత్రి రాజ్‌నాథ్‌సింగ్, సహాయ మంత్రి సంజయ్, ఎంపీలు కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, డీకే అరుణ, స్పీకర్ ప్రసాద్‌కుమార్, మంత్రి కొండా సురేఖ తదితరులు

# ఇటు నిర్బంధాలు

**బీఆర్ఎస్ నేతలు, దామగుండం పరిరక్షణ జేఏసీ నేతలను ఎక్కడికక్కడ అరెస్టు చేసిన పోలీసులు**

# అటు అబద్ధాలు

**అధికారిక కార్యక్రమంలోనూ ప్రతిపక్షాలపై విమర్శలు**

**సీఎం రేవంత్‌రెడ్డి వైఖరిపై భగ్గుమంటున్న పర్యావరణ వేత్తలు**

వికారాబాద్, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : దామగుండంలో వీఎల్ఎఫ్ రాడార్ కేంద్రం శంకుస్థాపన సందర్భంగా బీఆర్ఎస్ నేతలను, దామగుండం అడవి పరిరక్షణ జేఏసీ సభ్యులను, ప్రకృతి ప్రేమికులను ఎక్కడికక్కడ నిర్బంధించారు. రాడార్ కేంద్రం శంకుస్థాపన సందర్భంగా నిరసనలు జరుగకుండా సోమవారం రాత్రి నుంచే ముందస్తు అరెస్టులు చేశారు. అరెస్ట్ చేసిన దామగుండం అడవి పరిరక్షణ జేఏసీ సభ్యులతోపాటు బీఆర్ఎస్, సీపీఎం నేతలు, ప్రజాసంఘాల నాయకులను కులకచర్ల, పరిగి, వికారాబాద్, కోట్‌పల్లి పోలీస్ స్టేషన్లకు తరలించారు. మోమిన్‌పేట మండలంలో అంత్యక్రియలకు వెళ్తున్న బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే మెతుకు ఆనంద్‌ను మోమిన్‌పేట మండలం చీమలదరిలో పోలీసులు అదుపులోకి తీసుకుని మోమిన్‌పేట పోలీస్ స్టేషన్‌కు తరలించారు. మరోవైపు రాడార్ కేంద్రం శంకుస్థాపన సందర్భంగా దామగుండం పరిసర గ్రామాలు, తండాల ప్రజలను గృహ నిర్బంధం చేశారు. శంకుస్థాపన కార్యక్రమం ముగిసే వరకు వారి అవసరాల కోసం కూడా బయటకు రానివ్వకుండా పోలీసులు బెదిరించి గృహ నిర్బంధం చేయడంపై ప్రజలు భయభ్రాంతులకు గురయ్యారు. దామగుండం అడవిని నాశనం చేసే రాడార్ కేంద్రం ఏర్పాటును నిరసిస్తూ వికారాబాద్, తాండూరులలో బీఆర్ఎస్ నేతలు నల్ల బ్యాడ్జీలతో నిరసన వ్యక్తం చేశారు. బీసీ కమిషన్ మాజీ సభ్యుడు శుభప్రద్‌పటేల్‌తోపాటు జడ్పీ మాజీ వైస్ చైర్మన్ బైండ్ల విజయ్‌కుమార్, కౌన్సిలర్ కిరణ్ పటేల్, బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు, నాయకులు సురేశ్‌గౌడ్, కేదార్‌నాథ్, ప్రభాకర్ రెడ్డి, రంజిత్, మణికంఠ తదితరులు నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలిపారు.



దోమ పోలీస్‌స్టేషన్ వద్ద మాజీ వైస్ ఎంపీపీ మల్లేశం, నాయకులు రాజిరెడ్డి, గోపాల్‌గౌడ్




కులకచర్ల పోలీస్‌స్టేషన్‌లో ఉన్న బీఆర్ఎస్ నాయకులు



దామగుండానికి వెళ్లకుండా అడ్డుకుంటున్న పోలీసులు

రాడార్ కేంద్రం శంకుస్థాపన కార్యక్రమం వేదికగా బీఆర్ఎస్ ప్రభుత్వంపై సీఎం రేవంత్ రెడ్డి అబద్ధాలను వల్లె వేశారు. రాడార్ కేంద్రానికి భూములు కేటాయించారంటూ, లక్షల చెట్లు తొలగించనున్నారని ప్రచారం చేస్తున్నారని, రాడార్ కేంద్రం ఏర్పాటును వివాదం చేస్తున్నారని సీఎం బీఆర్ఎస్ పార్టీని విమర్శించారు. అంతేకాకుండా పర్యావరణ ప్రేమికులపైనా దేశం, దేశ ప్రజలు సురక్షితంగా ఉంటేనే పర్యావరణ విషయమై ఆలోచిస్తామంటూ ముఖ్యమంత్రి వ్యాఖ్యలు చేశారు. వాస్తవానికి జీవవైవిధ్యానికి మారుపేరుగా ఉన్న దామగుండం అడవిని పరిరక్షించేందుకు బీఆర్ఎస్ ప్రభుత్వం పదేండ్లపాటు రాడార్ కేంద్రం ఏర్పాటుకు అడుగు ముందుకు వేయలేదు. మూసీ, ఈసీ నదుల మనుగడ ప్రమాదంలో పడనున్నదని, జీవవైవిధ్యానికి ప్రమాదం ఏర్పడనున్నదని, రేడియేషన్ ప్రభావంతో స్థానిక ప్రజలకు ముప్పు వాటిల్లనున్నదని గుర్తించి బీఆర్ఎస్ ప్రభుత్వం ఈ ప్రాజెక్టును పెండింగ్‌లో పెట్టింది. సీఎం రేవంత్ రెడ్డి ఉద్దేశపూర్వకంగానే బీఆర్ఎస్ పార్టీపై బురదజల్లే ప్రయత్నం చేశారు. మరోవైపు రాడార్ ఏర్పాటుతో దామగుండంలో తొలగించే చెట్ల విషయంలోనూ ప్రభుత్వం వాస్తవాలను దాచిపెట్టింది. రాడార్ కేంద్రం ఏర్పాటు చేస్తే దామగుండం అడవిలోని 12 లక్షల చెట్లు తొలగించాల్సి ఉంటుందని మొదట చెప్పిన అటవీ శాఖ అధికారులు.. ప్రకృతి ప్రేమికులు, స్థానికులు పెద్ద ఎత్తున నిరసన కార్యక్రమాలు చేయడంతో తర్వాత మాట మార్చారు. అమెరికాలాంటి దేశాలే ఈ రాడార్ ప్రాజెక్టు దుష్పరిణామాలు గుర్తిస్తే, మన ప్రజాప్రతినిధులు మాత్రం వాటిని పట్టించుకోకపోవడం వివాదాలకు తావిస్తున్నది. రాడార్ కేంద్రం ఏర్పాటు చేస్తే రేడియేషన్ ప్రభావంతో ప్రజల ప్రాణాలకు ముప్పు ఏర్పడే అవకాశం ఉన్నదని స్థానికులు భయాందోళనకు గురవుతున్నా సమావేశంలో ప్రజల సందేహాలను నివృత్తి చేసే ప్రయత్నం జరుగలేదని పర్యావరణ వేత్తలు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు.

**చెట్ల నరికివేతపై మారిన మాట..**

**అటవీశాఖ మొదట చెప్పింది..12 లక్షలు**


**నిరసనల అనంతరం మార్చి చెప్పిన లెక్క..1.93 లక్షలు**

**మళ్లీ మాట మార్చి తాజాగా చెప్పిన లెక్క..899 చెట్లు..**

**లక్షల చెట్లు నరకడం లేదు అంతా అబద్ధం.. అన్న సీఎం రేవంత్‌రెడ్డి మాత్రం నిజం ఏమిటో చెప్పలేదు..**



మాట్లాడుతున్న సీఎం రేవంత్‌రెడ్డి



దామగుండం అటవీ ప్రాంతం



నేవీ రాడార్ కేంద్రాన్ని ఏర్పాటు చేయవద్దంటూ తాండూరు పట్టణంలో నల్ల బ్యాడ్జీలతో నిరసన తెలుపుతున్న బీఆర్ఎస్వీ జిల్లా అధికార ప్రతినిధి దత్తాత్రేయ రావు తదితరులు



శంకుస్థాపన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజాప్రతినిధులు, అధికారులు

## రాష్ట్రంలో నిర్బంధ పాలన నడుస్తున్నది..



ఇది ప్రజా పాలన కాదు.. నిర్బంధ పాలన.. ప్రజలు వ్యతిరేకిస్తున్నా పట్టించుకోకుండా దామగుండం అటవీ ప్రాంతంలో కేంద్ర రక్షణ శాఖ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, సీఎం రేవంత్‌రెడ్డి కలిసి నేవీ రాడార్‌కు శంకుస్థాపన చేయడం ఏమిటీ ?.. చుట్టుపక్కల గ్రామాల ప్రజలు, తండావాసులు బయటికి రాకుండా గృహ నిర్బంధం చేసి శంకుస్థాపన చేయడం సిగ్గుచేటు. నియోజకవర్గంలోని వ్యక్తి మృతి చెందితే వెళ్తున్న మాజీ మంత్రి సబితారెడ్డిని అడ్డుకోవడం దుర్మార్గపు చర్య.. కాంగ్రెస్ ప్రభుత్వం అరాచక పాలన కొనసాగిస్తున్నది.

**– మెతుకు ఆనంద్, వికారాబాద్ మాజీ ఎమ్మెల్యే**

## నిజాలను దాయలేరు..



తెలంగాణలో ప్రజా పాలన కాదు.. ప్రతీకార పాలన సాగుతున్నది. రాడార్ శంకుస్థాపన కార్యక్రమానికి నిర్బంధాలు చేస్తుంటే జిల్లావాసులు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. బీఆర్ఎస్ నేతలను ఎక్కడికక్కడ అరెస్టులు చేయడం, చుట్టుపక్కల గ్రామాల జనాలను గృహ నిర్బంధాలు చేయడం వంటివి చూస్తున్న జనం ఇదేమి పాలన దేవుడా అంటూ అసహనం వ్యక్తం చేస్తున్నారు. ప్రశాంతంగా ఉన్న తెలంగాణను నిర్బంధ తెలంగాణగా మార్చారని కాంగ్రెస్ ప్రభుత్వంపై ధ్వజమెత్తుతున్నారు. దామగుండం అడవిలో నేవీ రాడార్ కేంద్రం శంకుస్థాపనను నిరసిస్తూ నల్లబ్యాడ్జీలను ధరించి బీఆర్ఎస్ శ్రేణులతో పాటు ప్రజలు నిరసన తెలిపారు.

**– శుభప్రద్ పటేల్, బీసీ కమిషన్ మాజీ సభ్యుడు**

# కమిటీలదే పెత్తనం!

**జిల్లాలోని పంచాయతీలు, మున్సిపాలిటీల్లో కొనసాగుతున్న ఇందిరమ్మ కమిటీల ఏర్పాటు ప్రక్రియ**

**కమిటీల్లో సర్పంచ్‌లు, కౌన్సిలర్లు, మహిళా సభ్యులకు ప్రాధాన్యత కల్పించిన ప్రభుత్వం**

**లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యానికి ఆస్కారం ఉండడంతో సర్వత్రా విమర్శలు**

**జిల్లాకు 28,000 ఇందిరమ్మ ఇండ్ల కేటాయింపు**

**ప్రజా పాలనలో ఇప్పటికే లక్షకుపైగా దరఖాస్తుల స్వీకరణ**



రంగారెడ్డి, అక్టోబర్ 15 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి రాష్ట్రంలో కాంగ్రెస్ అధికారంలో ఉన్నప్పుడు క్రియాశీలక పాత్ర పోషించిన ఇందిరమ్మ కమిటీలు మళ్లీ తెరపైకి వచ్చాయి. ఇందిరమ్మ ఇండ్ల పథకం కోసం ప్రతి పంచాయతీ, మున్సిపాలిటీ, కార్పొరేషన్లలో కమిటీలను ఏర్పాటు చేయాలని ఇటీవలనే ప్రభుత్వం ఉత్తర్వులు ఇచ్చింది. దీంతో కమిటీల ఏర్పాటుపై రంగారెడ్డి జిల్లాలో అధికారులు దృష్టి సారించారు. అయితే కమిటీల ఏర్పాటు సందర్భంగా ప్రభుత్వం ఇచ్చిన మార్గదర్శకాలపై ఎన్నో అనుమానాలు కలుగుతున్నాయి. లబ్ధిదారుల ఎంపికలో రాజకీయ జోక్యానికి ఆస్కారం ఉండడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### కమిటీలో క్రియాశీలక సభ్యులే..

ఇందిరమ్మ కమిటీల పేర్లను ఆగమేఘాల మీద పంపాలని మున్సిపల్ కమిషనర్లు, ఎంపీడీవోలకు ప్రభుత్వం ఆదేశాలు జారీ చేసింది. గత శనివారం కమిటీలను పూర్తి చేసి పంపాల్సి ఉండగా.. దసరా పండుగ, ఆదివారం సెలవు ఉండడంతో సాధ్యపడలేదు. దీంతో గత రెండు రోజులుగా అధికారులు ఈ కమిటీల ఏర్పాటుపైనే దృష్టి పెట్టారు. జిల్లాలోని 558 గ్రామపంచాయతీలతోపాటు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో ఏడుగురు సభ్యులతో కమిటీలను ఏర్పాటు చేస్తున్నారు. గ్రామపంచాయతీ స్థాయిలో ఏర్పాటు చేసే కమిటీకి సర్పంచ్ లేదా పంచాయతీ ప్రత్యేకాధికారి చైర్మన్‌గా, పంచాయతీ కార్యదర్శి కన్వీనర్‌గా ఉంటారు. మున్సిపల్ వార్డుస్థాయిలో వార్డు కౌన్సిలర్ లేదా కార్పొరేటర్ చైర్మన్‌గా, వార్డు అధికారి కన్వీనర్‌గా ఉంటారు. ఈ రెండు కమిటీల్లో.. స్వయం సహాయక సంఘాల నుంచి ఇద్దరు మహిళలు, గ్రామ, మున్సిపల్ వార్డు అభివృద్ధి కార్యక్రమాల్లో చురుగ్గా ఉండే ముగ్గురిని సభ్యులుగా నియమించనున్నారు. ఈ ముగ్గురిలో బీసీ, ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గాల నుంచి ఒక్కొక్కరు చొప్పున నియమించాలని ఉత్తర్వుల్లో ప్రభుత్వం సూచించింది. కమిటీల్లో నియమించేవారి పేర్లను ఎంపీడీవో, మున్సిపల్ కమిషనర్లు కలెక్టర్‌కు పంపితే.. కలెక్టర్ ఆ వివరాలను జిల్లా ఇన్‌చార్జి మంత్రికి వివరించి ఖరారు చేయాల్సి ఉంటుంది. జిల్లాలో కమిటీల ఎంపిక ప్రక్రియ చురుగ్గా సాగుతున్నది. ఇప్పటికే నాలుగైదు మండలాల్లో కమిటీలు పూర్తయినట్లు తెలిసింది. అయితే క్షేత్రస్థాయిలో క్రియాశీలకంగా ఉండే కార్యకర్తలనే ఇందిరమ్మ కమిటీల్లో చోటు కల్పించాలని కాంగ్రెస్ నేతల నుంచి అంతర్గతంగా సందేశాలు వెళ్తుండడంతో సర్వత్రా విమర్శలు వెల్లువెత్తుతున్నాయి.

### ఎంపిక పారదర్శకమేనా..!

ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారుల ఎంపికలో కమిటీలే క్రియాశీలక పాత్ర పోషించనున్నాయి. ఈ కమిటీలు ఇందిరమ్మ పథకానికి సంబంధించి ఎప్పటికప్పుడు గ్రామ, మున్సిపల్ వార్డు స్థాయిల్లో అవగాహనను పెంపొందించే కార్యక్రమాలను చేపడుతాయి. ఇండ్ల నిర్మాణంలో లబ్ధిదారులకు సహాయంగా ఉండడంతోపాటు సోషల్ ఆడిట్‌ను నిర్వహించనున్నాయి. అర్హులకు ఇల్లు అందకపోవడం.. అలాగే అనర్హులకు దక్కడం వంటివి ఏమైనా జరిగితే.. ఆ వివరాలను ఎంపీడీవోలు, మున్సిపల్ కమిషనర్ల దృష్టికి తీసుకెళ్లడంలో కమిటీలు ప్రముఖ పాత్ర పోషిస్తాయి. ఇందిరమ్మ కమిటీల పేరుతో కాంగ్రెస్ నాయకుల అనధికార పెత్తనం ఉండే అవకాశం ఉన్నదని ప్రతిపక్ష పార్టీలు అభ్యంతరం తెలుపుతున్నాయి.

కమిటీల ఖరారు కలెక్టర్, ఇన్‌చార్జి మంత్రి ద్వారానే ఖరారు కానుండగా.. అధికార పార్టీ ఎమ్మెల్యేల కనుసన్నల్లోనే ఎంపిక ప్రక్రియ జరుగనున్నదన్నది బహిరంగ రహస్యమే. ప్రతిపక్ష పార్టీల ఎమ్మెల్యేలు ఉన్నచోట ఓడిపోయిన కాంగ్రెస్ పార్టీ అభ్యర్థి ఇచ్చే జాబితాకే ప్రాధాన్యత ఇవ్వనున్నట్లు తెలుస్తున్నది. రాజకీయ నేతల జోక్యంతో ఏర్పడ్డ ఈ కమిటీలే లబ్ధిదారుల ఎంపికలోనూ క్రియాశీలక పాత్ర పోషించనుండడంతో వివిధ వర్గాలు ఆందోళనను వ్యక్తం చేస్తున్నాయి.

### నియోజకవర్గానికి 3,500 ఇండ్ల కేటాయింపు..

కాంగ్రెస్ పార్టీ ఎన్నికలకు ముందు ఇందిరమ్మ ఇండ్ల పథకం కింద రూ.5లక్షలు, ఎస్సీ, ఎస్టీ లబ్ధిదారులకైతే రూ.6లక్షల ఆర్థిక సాయాన్ని మూడు విడుతలుగా అందజేస్తామని హామీ ఇచ్చింది. అధికారంలోకి వచ్చాక గత డిసెంబర్ 28 నుంచి జనవరి 6 వరకు ప్రజా పాలన కార్యక్రమాన్ని నిర్వహించి ఇందిరమ్మ ఇండ్లకు సైతం దరఖాస్తులను స్వీకరించింది. ఇండ్లు నిర్మించుకునేందుకు జిల్లావ్యాప్తంగా లక్షకుపైగా దరఖాస్తులు వచ్చాయి. నియోజకవర్గానికి 3,500 ఇండ్లను నిర్మిస్తామని ప్రభుత్వం ఇప్పటికే కేటాయించింది. ఈ లెక్కన జిల్లాలోని 8 నియోజకవర్గాలకు 28వేల వరకు ఇండ్లను కేటాయించనున్నారు. ఈ దరఖాస్తులను సైతం ప్రభుత్వం పరిగణనలోకి తీసుకుని ఇందిరమ్మ కమిటీలకు అందించనున్నట్లు తెలుస్తున్నది.